ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం



3లో



# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd



న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తా...



3లో



Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 87 ఎడిటర్: నయింపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 25 మార్చి 2026


## బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

- ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు
- విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా
- మహిళలను కోటీశ్వరులను చేయాలనుకోవడం తప్పా
- బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా
- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా
- బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి చురకలు



**హైదరాబాద్,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం మిగతా2లో...



## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు

**జగిత్యాల,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ ఉద్దండుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానంపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం, ఆ తర్వాత జిల్లాలో తనకు ప్రాధాన్యత తగ్గడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25న పార్టీకి రాజీనామా చేస్తానని మిగతా2లో...



## సిఎం చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ

- అమరావతిలో ఫిలిం సిటీ వ్యవహారాలపై చర్చ

**అమరావతి, 24(పిసిడబ్ల్యూ న్యూస్):** అమరావతిలో త్వరలోనే ఏపీలో భారీ సినీ స్టూడియోలు లేదా అంతర్జాతీయ స్థాయి ఫిలిం సిటీ నిర్మాణంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సంజయ్ దత్ బృందం నేరుగా వెలగపూడిలోని సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. గత ఫిబ్రవరిలో ముంబై వేదికగా మంత్రి లోకేశ్‌తో జరిగిన చర్చల కొనసాగింపుగానే ఈ పర్యటన సాగుతున్నట్లు తెలుస్తోంది. సంజయ్ దత్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన ముగ్గురు కీలక ప్రముఖులు మిగతా2లో...

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

- ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్




2లో

## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు మిగతా2లో...





## కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

- మండిపడ్డ విపక్ష నేత రాహుల్

**న్యూఢిల్లీ,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమాసియా ఉద్రిక్తతలను గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ పరిస్థితి కోవిడ్ తరహాలా మిగతా2లో...

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు మిగతా2లో...



## త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

- కొనుగోలుదారు అఫ్పిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫ్పిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో మిగతా2లో...

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

- మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదరింపులు



2లో

## ఇవి వాహనాలపై 20-శాతం డిస్కౌంట్

- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహీంద్రా తదితర కంపెనీలు
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ మిగతా2లో...

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు.

# దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కళ్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగు తాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్సన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయి ంచడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యా ంగ సోదర సోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలి పెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం.

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

(మొదటి పేజీ తరువాయి)

కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

**న్యూఢిల్లీ,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయి తే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయ పడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.



# లొంగిపోయిన మావోయిస్ట్ నేత పాపారావు

**బీజాపూర్,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** మావోయిస్టు అగ్రనేత పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 17 మంది అనుచరులతో బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. లొంగిపోయిన వారిలో 10 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. వారి నుంచి భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతానికి చెందిన పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. అతడిపై 50 కేసులు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ అపహరణ ఉదంతంలో పాపారావు కీలక పాత్ర పోషించాడు. 76 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలోనూ ఇతడి హస్తం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

# ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ర వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు , హైర్ లేదా డిపా÷-టం÷-మెంట్ లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ర బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

# సిఎం చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీలో పాల్గొన్నారు. గౌరవ్ దూబే , కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వీరిలో ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఒక భారీ ఫిలిం సిటీ లేదా సినిమా హబ్ అవసరం ఎంతైనా ఉంది. గతంలో లోకేశ్‌తో జరిగిన భేటీలో సంజయ్ దత్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఈ ఫిలిం సిటీని అమరావతి పరిసరాల్లో లేదా విశాఖపట్నంలో ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. సినిమా షూటింగ్‌ల కోసం ఏపీని ఒక గమ్యస్థానంగా మార్చడానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, మౌలిక సదుపాయాలపై సీఎం చంద్రబాబు సంజయ్ దత్ బృందానికి వివరించినట్లు తెలుస్తోంది. ఏపీలో సినిమా ఇండస్ట్రీకి అవసరమైన లొకేషన్లు పుష్కలంగా ఉన్నాయి. సంజయ్ దత్ వంటి అగ్ర నటులు ఇక్కడ స్టూడియోలు లేదా ఫిలిం సిటీలను నిర్మిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. బాలీవుడ్, సౌత్ సినిమాల కలయికతో ఏపీ సినీ హబ్‌గా మారుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఉభయులూ చర్చించారు' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. రాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేశారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుపుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే అమెరికాతో చర్చలను ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

# కోవిడ్ విషాదాలను మరచిన ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఉందంటూ పేర్కొనడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపాయారా? అని ప్రశ్నించారు. పార్లమెంటు వెలుపల మీడియాతో రాహుల్ మంగళవారంనాడు మాట్లాడారు. 'పార్లమెంటులో ఆయన నిన్న సందర్భోచితం కాని మాటలు మాట్లాడారు. కరోనా మహమ్మారితో ప్రస్తుత సందర్భాన్ని పోల్చారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో ఇప్పుడే పెరుగుదల మొదలైంది. ఇంతలోనే పరిస్థితిని కరోనా మహమ్మారి రోజులతో ఆయన పోలుస్తున్నారు. కరోనా విరుచుకుపడిన సమయంలో జరిగిన విషాదాల గురించి ఆయన మరిచిపోయినట్టున్నారు' అని రాహుల్ అన్నారు. దేశ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, దేశ విదేశాంగ విధానం మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిందని, అంతర్జాతీయంగా ఇదొక హాస్యాస్పద అంశంగా మారిందని అన్నారు. 'మోదీ రాజీపడితే మన విదేశాంగ విధానం కూడా రాజీపడినట్టే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ రాజీకొచ్చినట్టే కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. మధ్యఆసియాలో పరిణామాలపై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష సమావేశంపై అడిగినప్పుడు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినా సరిదిద్దుకోలేని నిర్మాణాత్మక తప్పిదం జరిగిందని అన్నారు. అమెరికా ఏది చెబితే అది మోదీ చేస్తారని, రైతులు, దేశ ప్రయోజనాల కోసం పనిచేయరని విమర్శించారు. కేరళలో తనకు ప్రోగ్రాం ఉన్నందున అఖిల పక్ష సమావేశానికి హాజరుకాకపోవచ్చని చెప్పారు.

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

(మొదటి పేజీ తరువాయి)


ఆయన ప్రకటించడంతో, కాంగ్రెస్ అధిష్ఠానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా పార్టీ కండువా కప్పే ప్రయత్నం చేయగా... "జరిగిన అవమానం చాలు.. ఇక ఈ కండువా వద్దు" అంటూ జీవన్ రెడ్డి సున్నితంగా తిరస్కరించడం అందరినీ షాక్ కు గురిచేసింది. మరోవైపు, జీవన్ రెడ్డికి ఒకప్పుడు అత్యంత సన్నిహితుడిగా ఉండి, ఇప్పుడు ఎమ్మెల్యే సంజయ్‌తో కలిసి తిరుగుతున్న డీసీసీ అధ్యక్షుడు నందయ్యను లోపలికి రానివ్వకుండా జీవన్ రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెనుదిరగాల్సి వచ్చింది.

# త్వరలో 'సాదాబైనామా' పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేలిపారు. ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం



**హైదరాబాద్,మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వర్షం పడింది. పలు చోట్ల రహదారులపై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మణికొండలో వడగళ్ల వాన కురిసింది. యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్‌లో రహదారులను వాన నీరు ముంచెత్తింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వాన నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

# 22 మందికి ఉద్యోగావకాశాలు

**పరకాల, మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** పరకాల స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ సెల్ మరియు కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం (మార్చి 24) మెగా జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించారు. ఈ మేళాలో సుమారు 100 మందికి పైగా నిరుద్యోగ యువత పాల్గొనగా, వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ హాజరై అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలు అందరికీ సాధ్యం కావని, నైపుణ్యాలు పెంపొందించుకుంటే ప్రైవేట్ రంగంలో కూడా మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్పొరేట్ సంస్థల్లో లక్షల రూపాయల జీతాలు పొందుతున్న యువతకు ఉదాహరణగా నిలుస్తూ, ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆర్. ఈశ్వరయ్య మాట్లాడుతూ, ఉద్యోగంలో తొలి దశలో కొంత ఇబ్బందులు సహజమని, వాటిని సానుకూలంగా స్వీకరించి ఇష్టంతో పనిచేస్తే విజయం సాధ్యమని అన్నారు. ఈ జాబ్ మేళాలో హెటిరో ఫార్మా, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, సత్యం స్కిల్ డెవలప్మెంట్





ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ ప్లస్, ఎల్ఐసీ, విన్సోల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ది ఎంపైర్ గ్రూప్ (ఇంపల్స్ డివిజన్), ప్రతాప్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, నిర్మాణ్ ఆర్గనైజేషన్, ఎక్సలరేట్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్. మల్లయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎలిషాల అశోక్, అధ్యాపకులు అన్నం శ్రీనివాసరెడ్డి, తాడిపర్తి భీమారావు, బి. మహేంద్రరావు, డాక్టర్ టి. కల్పన, డాక్టర్ జి. పావని, డాక్టర్ జి. స్వప్న, డాక్టర్ ఆడెపు రమేష్, డాక్టర్ కె. జగదీష్ బాబు, డాక్టర్ జి. రామకృష్ణ, ఎం. సమ్మయ్య, ఎస్. రాజశ్రీ, డాక్టర్ సంజయ్, అలేఖ్య, పవన్ కుమార్ తదితరులు




పాల్గొన్నారు. అలాగే నాన్ టీచింగ్ సిబ్బంది కృష్ణ, వంశి, శ్రీనివాస్, సాగర్ మరియు విద్యార్థులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళా ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం




**ఆత్మకూర్, మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. క్షయవ్యాధి నిర్మూలనలో విశేష సేవలు అందించిన ల్యాబ్ టెక్నీషియన్ వంగల రాజేంద్రప్రసాద్‌కు ప్రత్యేక పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ చేతుల మీదుగా, స్థానిక సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ అప్పయ్య, క్షయవ్యాధి నిర్మూలన అధికారి డా. కె. హిమబిందు సమక్షంలో రాజేంద్రప్రసాద్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, క్షయవ్యాధి నిర్మూలనలో వైద్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని సూచించారు. అవార్డు అందుకున్న రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తనకు సహకరించిన సహచర సిబ్బందికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తాను మరింత కృషి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తా...

### రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ముద్దసాని సహోదర రెడ్డి

### హనుమకొండ జిల్లా న్యాయవాదుల ఘన సన్మానం

**హనుమకొండ , మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** సమాజంలో గౌరవ ప్రదమైన వృత్తిలో కొనసాగుతున్న న్యాయవాదుల రక్షణ, సంక్షేమం కోసం కృషిచేస్తానని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి అన్నారు. హోరా హోరీగా జరిగిన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి గెలిచిన ఏకైక నాయకుడు ముద్దసాని సహోదర్ రెడ్డి కి హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ఆద్వర్యంలో పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాలతో, పోటోలు బహుకరించి మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సహోదర్ రెడ్డి మాట్లాడుతూ 45 సంవత్సరాల నా న్యాయవాద వృత్తిలో ఎన్నో పదవులను అనుభవించి న్యాయవాదుల హక్కుల కోసం పోరాడానని, న్యాయవాదుల సంక్షేమం, రక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి న్యాయవాదుల సంక్షేమ నిధిని పెంచుతాననని,



జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ కోసం కృషి చేస్తానని, 41 సి ఆర్ పి సి వల్ల న్యాయవాదులతో పాటు సామాన్య ప్రజలకు చాలా నష్టం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వంలోని ఎమ్మెల్యే, మంత్రులతో చర్చించి 41 సి ఆర్ పి సి ఎత్తివేసేందుకు కృషి చేస్తానని, కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చే వారు వృత్తిలో నిలదొక్కుకునేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ మాట్లాడుతూ వరంగల్ నుండి 11 మంది పోటీ చేయగా ఏకైక వ్యక్తి సహోదర్ రెడ్డి గెలిచి పోరాట జిల్లా వరంగల్ ప్రతిష్టను కాపాడాడని అన్నారు. తనకున్న అనుభవంతో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ కావాలని, రెండు తరాల న్యాయ వ్యవస్థకు సాక్షిగా నిలిచిన సహోదర్ రెడ్డి న్యాయవాదుల సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని అన్నారు. బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నాగేంద్ర




ఆధ్వర్యంలో మహిళా బార్ హాల్ లో జరిగిన సన్మానంలో సహోదర రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా నుండి మహిళలు కూడా బార్ కౌన్సిల్ కు పోటీ చేసి గెలవాలని, అందుకు నా సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, ఉపాధ్యక్షులు రమేష్, సంయుక్త కార్యదర్శి అంబేద్కర్, బార్ అసోసియేషన్ నాయకులు వేద కుమారి, స్వాతి, న్యాయవాదులు అంబరీష్ రావు, చిల్లా రాజేంద్రప్రసాద్, శ్యాం సుందర్ రెడ్డి, గంగాదర్ రావు, చిదంబర్ నాథ్, శ్రీధర్ రెడ్డి, చకిలం ఉపేందర్, సాయిని నరేందర్, నాగేంద్ర, కళకోట్ల నిర్మల జ్యోతి, రత్న మంజుల, సుశీల, స్వప్న, వనజ, పద్మావతి, టి సి సుజాత, జన్ను పద్మ, రజని, భాగ్య, జలజ, రమాదేవి, అనిత, జన్ను ప్రభాకర్, సన్నీ, నారాయణ రావు, రాహుల్, లోకేష్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు

# ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సహాయంతో

# చిన్నారి ఋత్వికకు పునర్జన్మ



**పరకాల, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో మానవత్వాన్ని చాటిచెప్పిన హృద్యమైన ఘటన చోటుచేసుకుంది. గుండె సంబంధిత సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆరు నెలల చిన్నారి ఋత్వికకు అపోలో 'హృదాన్' (HRIDAAN) కార్యక్రమం ద్వారా విజయవంతంగా శస్త్రచికిత్స జరగడంతో ఆమెకు పునర్జన్మ లభించింది. పట్టణానికి చెందిన బొచ్చు శరత్–చైతన్య దంపతుల కుమార్తె ఋత్విక తీవ్రమైన గుండె సమస్యతో బాధపడుతుండగా, అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఆ కుటుంబం మార్చి 8న ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని ఆశ్రయించింది. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న వెంకట్రామ్ రెడ్డి వెంటనే స్పందించి, ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అపోలో ఆసుపత్రి యాజమాన్యంతో సంప్రదించి, 'హృదాన్' కార్యక్రమం కింద జూబ్లీహిల్స్ అపోలోలో మార్చి 18న ఉచితంగా శస్త్రచికిత్స చేయించారు. వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ఆపరేషన్ విజయవంతమై చిన్నారి ప్రస్తుతం ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్నారి తల్లిదండ్రులు తమ బిడ్డతో కలిసి వెంకట్రామ్ రెడ్డి నివాసానికి వెళ్లి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ కుమార్తెకు పునర్జన్మ ప్రసాదించినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంతో పేర్కొన్నారు. చిన్నారి ఆరోగ్యంగా కోలుకోవడం పట్ల వెంకట్రామ్ రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, ఆమె భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సంఘటన స్థానికంగా మానవత్వానికి నిలువుటద్దంగా నిలిచింది.

# దేవేందర్ రెడ్డి చేతుల మీదుగా సీసీ రోడ్డు పనుల ప్రారంభం




**పరకాల రూరల్, మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** పరకాల మండలం పైడిపెల్లి గ్రామంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించడమే లక్ష్యంగా ఈ పనులను చేపట్టడం విశేషం. గ్రామ సర్పంచ్ బొచ్చు రమేష్, ఉపసర్పంచ్ నాగుల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల




అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మాజీ ఎంపీటీసీ పర్నం మల్లారెడ్డి, నాగారం హనుమాన్ టెంపుల్ చైర్మన్ ఎలమంచ కృష్ణారెడ్డి, చిట్టిరెడ్డి నర్సింహారెడ్డి, దాసరి బిక్షపతి, అమ్మ కిషన్, రామంచ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి గోరింటాల దినేష్, వార్డు సభ్యులు పసుల సౌందర్య–కుమారస్వామి, బొచ్చు సుజాత–పాణి, బొచ్చు అన్వేష్, పసుల రవిందర్, నాగుల ఎల్లస్వామి, పసుల సాంబయ్య హాజరయ్యారు. మాజీ గ్రామ అధ్యక్షుడు బండి కుమార్, జలరపు రాజు, కొనకండ్ల మధుకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.

# విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన లెక్చరర్‌పై కేసు నమోదు

**సత్తుపల్లి, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లిలోని కాకతీయ డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేస్తున్న అంజిబాబు పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిర్యాదిని పుస్తకాలు ఇస్తానని చెప్పి తన గదికి రమ్మని పిలిచి, ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ ఎస్. వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విద్యాసంస్థల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు: ఎస్సై సతీష్




**చిట్యాల మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి భూపాలపల్లి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జడ్జి దిలీప్ నాయక్.రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఓ గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో ఇతని ఆల్కహాల్ రీడింగ్ 550 mg/100ml గా నమోదైంది, ఇది అనుమతించబడిన పరిమితి కంటే చాలా ఎక్కువ. కోర్టు తీర్పు: నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, మోటార్ వాహనాల చట్టం (వీ.ఎ చావ్) సెక్షన్ 185(a), 130/177 కింద నేరం నిరూపితమైంది. దీంతో న్యాయమూర్తి నిందితుడికి:ద02 రోజుల సాధారణ జైలు శిక్ష (పరకాల సబ్ జైలులో అనుభవించాలి). రూ. 2,100/- నగదు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సతీష్ హెచ్చరించారు.

# జమ్మికుంటలో డా. అంబాల ప్రభాకర్‌కు ఘన సన్మానం



**జమ్మికుంట, మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) బలోపేతానికి నూతన ఉత్సాహం దక్కింది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి బీఎస్పీలో చేరిన డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు)ను హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించడాన్ని పలువురు అభినందించారు. ఈ నేపథ్యంలో జమ్మికుంటలోని ఆయన నివాసంలో సోమవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అభిమానులు, నాయకులు కలిసి ఆయనకు శాలువా కప్పి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పబ్బు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని డాక్టర్ ప్రభును కోరారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలనుబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అగ్రకులాల పేదలనుఏకం చేస్తూ బహుజన రాజ్యాధికార సాధనలో ముందుండాలని సూచించారు.హుజురాబాద్ ప్రాంతానికి ప్రత్యేకమైన పోరాటస్ఫూర్తి ఉందని, ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్ర రాజకీయాల్లో ముందంజలో నిలిపే బాధ్యత డాక్టర్ ప్రభుపై ఉందన్నారు. యువత ముందుకు వచ్చి బీఎస్పీ సిద్ధాంతాలను బలపరిచి, బహుజన వాదాన్ని మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.డాక్టర్ ప్రభు నాయకత్వంలో పార్టీ మరింత శక్తివంతంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇనుగాల సతీష్, బండి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను భారాలు వెంటనే తగ్గించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- సిపిఎం ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ ఆఫీస్ ముందు భారీ ధర్నా...







**ఖమ్మం ప్రతినిధి, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగర ప్రజలపై వేస్తున్న ఇంటి పన్ను ఆర్థిక భారాలను వెంటనే తగ్గించాలని, తగ్గించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నాను పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... అనంత్ ప్రయివేటు లిమిటెడ్ అనే సంస్థకు ఆస్తి పన్నులు వేసే అధికారం కట్టబెట్టడం వెనుక మతలబు ఏమిటో ఖమ్మం నగర ప్రజలకు కమిషనర్, మేయర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో వేస్తున్న ఆస్తి పన్నులపై అనేక అవకతవకలు జరిగే అవకాశం ఉందని, వెంటనే గత పాలసీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఇంటి పన్నులపై పాత జీవో ఉత్తర్వులను పక్కన బెట్టి మరీ క్రమబద్ధీకరణ పేరుతో ఎడాపెడా నగర ప్రజలపై ఇంటి పన్నులు వేసి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వస్తున్న ఇంటి టాక్స్ బిల్లులు చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులు వేసే విధానాన్ని పలు సర్కిల్ గా విభజన చేసి మరీ టాక్స్ లు వేయడం అనాలోచిత నిర్ణయం అని దుయ్యబట్టారు. పన్నులపై వడ్డీ పేరుతో మరింతగా అపరాధ రుసుం వేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పైగా ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మరింత ఇంటి పన్నులు పెరుగుతాయి అని మీడియాలో వస్తున్న వార్తలపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు ఆమోదం తెలిపి క్రమక్రమంగా ప్రజలపై వివిధ రూపాల్లో ఆర్థిక భారాలు వేసే పనిలో పడిందని ఆరోపించారు. చెత్త పన్ను, నీళ్ళు పన్ను, ఇంటి పన్ను ఇలా భారాలు వేయడం ప్రయివేటీకరణలో భాగమే అని విమర్శించారు. తక్షణమే ఖమ్మం కార్పొరేషన్ అధికారులు, కమీషన్, మేయర్, మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని నగర ప్రజలకు ఇంటి పన్నుల భారాలు నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే నగర ప్రజలను సమీకరించి ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కె శ్రీనివాసురావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పై అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, టి విష్ణు, ఎంఎ జబ్బర్, భుక్యా శ్రీనువాసరావు, షేక్ మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, పి.రమ్య, షేక్ నాగులు మీరా, బోడపట్ల సుదర్శన్, ఉపేంద్ర, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి. నాగసులోచన, కార్పొరేటర్లు యర్రా గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు



**ములుగు జిల్లా ,మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలలో, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ కింద ఎస్ఎన్‌సీయూ (నవజాత శిశు సంరక్షణ కేంద్రం)లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు మరియు సపోర్టింగ్ స్టాఫ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో, కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ సమస్యలను పరిష్కరించాలంటూ పలుమార్లు ఉన్నతాధికారులకు, సంబంధిత మంత్రులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. చిన్న ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గంగాధర్, భద్రయ్య, బతుకమ్మ, హసీనా, సుమలత, రాకేష్, దేవేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్: కాంగ్రెస్‌లో చేరిన కొత్తపల్లి సర్పంచ్ శోభారాణి

- కండువా కప్పిన కవ్వంపల్లి..



**తిమ్మాపూర్,మార్చి24(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగలింది. ఇటీవలనే బీఆర్ఎస్ కు చెందిన పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్న తన భర్త మహేందర్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితోపాటు పర్లపల్లి గ్రామానికి చెందిన మరో ముగ్గురు వార్డు సభ్యులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.తాజాగా కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన కార్యాలయంలో శోభారాణికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుండటం, నిధుల మంజూరులో ఎలాంటి వివక్షత చూపించకపోవడం వంటి చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని, బీఆర్ఎస్ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.కొత్తపల్లి గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానన్నారు. మూడున్నర కోట్ల రూపాయల నిధులతో డ్రైనేజీ, మంచినీటి పథకం పనులను వచ్చే ఏప్రిల్ మాసంలో చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే వెల్లడించారు. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం పెంచాలని, అలాగే ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్ శోభారాణిని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొత్తపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు గోదారి తిరుపతి, కవ్వంపల్లి యువ సేన జిల్లా అధ్యక్షుడు నోముల అనిల్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం జిల్లా నాయకుడు పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ నెహ్రూ కాలనీలో షార్ట్ సర్కిల్‌తో ఇల్లు దగ్ధం

**కన్నీటి కడలిలో కుటుంబం**

**మిగిలింది కేవలం బాధ మాత్రమే**

**ఆధారం కోల్పోయిన కుటుంబం.**

**ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు**





**షాద్ నగర్, మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** విధి ఒక్కసారిగా విరుచుకుపడితే జీవితం ఎలా తలకిందులవుతుందో నెహ్రూ కాలనీలో జరిగిన ఈ ఘటన చూస్తే అర్థమవుతుంది.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీ 19వ వార్డులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదం ఓ నిరుపేద కుటుంబాన్ని వీధిన పడేసింది.హమాలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న పిట్టల శీను, ఇళ్లలో పని చేసే భార్య విజయలక్ష్మి కలిసి తమ ఇద్దరు ఆడబిడ్డలతో చిన్న సిమెంట్ రేకుల ఇంటిలో నివసిస్తున్నారు.వచ్చిన చిరు ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఈ దంపతులపై దురదృష్టం పడింది.ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి చిన్న ఇల్లు క్షణాల్లోనే అగ్నికి ఆహుతైంది.చుట్టుపక్కల వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఇల్లు చిన్నగా ఉండటంతో మొత్తం కాలిపోయింది.ఇంట్లో బీరువాలో దాచుకున్న మహిళా సంఘం రూ.60 వేల నగదు, బట్టలు, వంట సామాన్లు, ముఖ్య పత్రాలు, నిత్యావసర సరుకులు అన్నీ అగ్నికి హాహుతి అయ్యాయి.చివరకు వారు కట్టుకున్న బట్టలు తప్ప మరేం మిగలని పరిస్థితి ఏర్పడింది.పెద్ద కూతురు ఇంటర్మీడియట్ చదువుతుండగా...చిన్న కూతురు ఐదో తరగతి చదువుతోంది.ఇలాంటి సమయంలో ఇల్లు కాలిపోవడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడింది. సంఘటనా స్థలంలో దంపతులిద్దరూ కన్నీరు మున్నీరుగా విలపించగా, చూసిన వారందరూ భావోద్వేగానికి గురయ్యారు.బాధితులను ఓదార్చిన ప్రజాప్రతినిధులుసమాచారం అందుకున్న వెంటనే మున్సిపల్ చైర్మన్ అంగనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో చలించిన చైర్మన్ బసవేశ్వర్ తక్షణ సాయంగా రూ.5 వేల నగదు అందజేశారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి కూడా స్పందించి రూ.10 వేల నగదు సాయం అందజేశారు.సహాయం కోసం వేడుకుంటున్న బాధితులుప్రస్తుతం ఆ కుటుంబం ఆర్థికంగా పూర్తిగా కుంగిపోయి, ఎలాంటి ఆధారం లేకుండా జీవనం సాగించే పరిస్థితిలో ఉంది.మానవతా దృక్పథంతో ప్రజలు ముందుకు వచ్చి సహాయం చేయాలని స్థానికులు, జర్నలిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు.సాయం చేయాలనుకునేవారు:ఫోన్ /గూగుల్ పే 8186095968 (శేఖర్ బాధిత కుటుంబ సభ్యుడు)మానవత్వమే వారికి ఆధారంఒక్కసారిగా జీవితమంతా కోల్పోయిన ఈ కుటుంబానికి సమాజమే అండగా నిలవాల్సిన అవసరం ఉంది.చిన్న సహాయం కూడా వారికి పెద్ద బలం అవుతుంది.పేదోడి కన్నీరు తుడవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ముందుకు రావాల్సిన సమయం ఇది.

# కౌసల్యాదేవిపల్లిలో 'పోలీస్ అవగాహన సదస్సు': యువత లక్ష్యంగా డ్రగ్స్ రహిత సమాజం!

**ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి: ఎస్సై ఎం. సురేష్ హెచ్చరిక.**

**మాయగాళ్ల వలలో పడకండి.. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం.**

**డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి పిలుపు**



**నర్సింహులపేట , మార్చి 24 (పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి గ్రామంలో మంగళవారం స్థానిక పోలీసులు రోడ్డు భద్రత, డ్రగ్స్ నిర్మూలన మరియు సైబర్ నేరాలపై భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహులపేట ఎస్సై ఎం. సురేష్ గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు. **హెల్మెట్ ధరించడం ప్రాణానికి రక్షణ:** రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ప్రాణనష్టం హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరుగుతోందని ఎస్సై ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అతివేగం మృత్యువుకు దారి తీస్తుందని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. **డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం:** యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై పిలుపునిచ్చారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజ శాంతి భద్రతలను కాపాడడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. **సైబర్ నేరాలపై అప్రమత్తత:** అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపి ( ఓటిపి )లను ఎవరికీ షేర్ చేయవద్దని సైబర్ క్రైమ్ పట్ల ప్రజలను హెచ్చరించారు. అమాయకులను ఆశ చూపి దోచుకునే ముఠాలు పెరిగిపోయాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, పోలీసు సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ గ్రామంలో ఇలాంటి విజ్ఞానదాయకమైన సదస్సు నిర్వహించినందుకు గ్రామస్తులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాణాల అంచున తల్లిశిశువు

**- యశోద వైద్యుల అప్రమత్తతతో నవజీవితం**

**- క్లిష్ట గర్భధారణను విజయవంతంగా ఎదుర్కొని తల్లిని, ముందస్తుగా జన్మించిన శిశువును సురక్షితంగా కాపాడిన మలక్‌పేట్ యశోద ఆసుపత్రి వైద్య బృందం**




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఒకవైపు ప్రాణాలకు ముప్పుగా మారిన క్లిష్ట గర్భధారణ... మరోవైపు పుట్టిన క్షణాల నుంచే శ్వాస సమస్యలతో పోరాడిన పసికందు... అలాంటి అత్యంత విషమ పరిస్థితుల్లో తల్లి, శిశువు ఇద్దరికీ మళ్లీ జీవాన్ని అందించిన ఘటన వైద్య రంగంలో మానవతా విలువలకు ప్రతీకగా నిలిచింది. వైద్యుల సమయస్ఫూర్తి, నైపుణ్యం, అత్యాధునిక చికిత్సా సదుపాయాల సమన్వయంతో మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ అరుదైన క్లిష్ట కేసు విజయవంతంగా పూర్తయిందని మలక్‌పేట్ యశోద ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ సత్యప్రియ సాహూ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.... 32 ఏళ్ల గర్భిణి అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్ లోని మలక్‌పేట్ యశోద ఆసుపత్రిని ఆశ్రయించారన్నారు. ఆమెకు బైకోర్నుయేట్ యూటరస్, షార్ట్ సర్విక్స్, మధుమేహం, థైరాయిడ్ సమస్య, రక్తహీనత వంటి ఇబ్బందులు ఉండటంతో పాటు, గత గర్భధారణల్లోనూ ఇబ్బందులు ఎదురైన నేపథ్యం ఉండటంతో ఈ కేసు వైద్యులకు నిజంగా ఒక సవాలుగా మారిందన్నారు. ఎప్పుడైనా గర్భస్రావం సంభవించే ప్రమాదం, లేదా ముందస్తు ప్రసవం జరిగే పరిస్థితి ఉండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలోని నిపుణుల బృందం గర్భిణి పరిస్థితిని పూర్తిగా అంచనా వేసి, అత్యవసరంగా లాపరోస్కోపిక్, అబ్డామినల్ సర్క్లాజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారన్నారు. అంతేకాకుండా అవసరమైన బ్లాడర్ డిసెక్షన్, సిస్టోస్కోపీ, యూరెటరోస్కోపీ వంటి సున్నితమైన వైద్య ప్రక్రియలను కూడా సమర్థవంతంగా పూర్తిచేసి తల్లి ప్రాణాలను కాపాడే దిశగా కీలక చర్యలు చేపట్టామన్నారు. రోగిలో ఉన్న రక్తహీనతను తగ్గించేందుకు రక్తం ఎక్కించడం, గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలించేందుకు ఫీటల్ మానిటరింగ్ చేయడం వంటి చర్యలతో గర్భధారణను అత్యంత జాగ్రత్తగా పరిశీలనలో ఉంచటం జరిగిందన్నారు. ప్రతిక్షణం ఉత్కంఠ భరితంగా మారిన ఈ వైద్య ప్రయాణంలో వైద్యుల పట్టుదల, నిబద్ధత కుటుంబ సభ్యులకు భరోసా నింపిందన్నారు. అయితే గర్భధారణ 34 వారాలకు చేరుకున్న సమయంలో గర్భస్థ శిశువుకు ఫీటల్ డిస్ట్రెస్ లక్షణాలు కనిపించాయి. పరిస్థితి విషమిస్తున్నట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా అత్యవసర సిజేరియన్ నిర్వహించామన్నారు. ఈ శస్త్రచికిత్స ద్వారా 2.13 కిలోల బరువుతో పసికందు జన్మించిందన్నారు. కానీ జన్మించిన వెంటనే శిశువుకు శ్వాసకోశ సమస్యలు తలెత్తడంతో మరోసారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ తరుణంలో నియోనేటల్ నిపుణులు వెంటనే స్పందించి శిశువును ఎన్ఐసీయూలో చేర్పించి ప్రత్యేక చికిత్స ప్రారంభించారు. డాక్టర్ సత్యప్రియ సాహూ పర్యవేక్షణలో శిశువుకు సీపీఏపీ ద్వారా శ్వాస సహాయం, జాండీస్‌కు ఫోటోథెరపీ, హైపోకాల్సీమియాకు తగిన మందులు అందించారు. వైద్యుల అంకితభావంతో చేసిన చికిత్సకు కేవలం 38 గంటల్లోనే శ్వాస సమస్యలు తగ్గుముఖం పట్టాయి. అనంతరం శిశువు క్రమంగా తల్లిపాలను స్వీకరించడం ప్రారంభించడం, ఇన్ఫెక్షన్ లక్షణాలు లేకపోవడం వైద్యులకు, కుటుంబ సభ్యులకు అమితానందాన్ని కలిగించింది. చికిత్స పూర్తయ్యాక తల్లి, శిశువు ఇద్దరూ స్థిర ఆరోగ్య పరిస్థితిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడం జరిగిందన్నారు. కన్నీటి క్షణాలను చిరునవ్వుల జ్ఞాపకాలుగా మార్చిన ఈ వైద్య విజయం అక్కడి సిబ్బంది సేవా తత్వానికి ప్రతిబింబంగా నిలిచింది. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ, "ఇలాంటి క్లిష్ట గర్భధారణలను సమయానికి గుర్తించి సరైన శస్త్రచికిత్స, పర్యవేక్షణ అందిస్తే తల్లి, శిశువు ఇద్దరికీ మంచి ఫలితాలు సాధించవచ్చు" అని తెలిపారు. డాక్టర్ సత్యప్రియ సాహూ మాట్లాడుతూ, "ముందస్తుగా జన్మించిన శిశువులకు వెంటనే సరైన వైద్య సహాయం అందించడం ఎంతో కీలకం అన్నారు. సమయానికి చికిత్స అందించగలిగితే ప్రమాదాలను అధిగమించవచ్చని అన్నారు. మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ...అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణుల బృందం, సమన్వయంతో కూడిన చికిత్సా విధానం వల్ల ఇలాంటి అత్యంత క్లిష్ట కేసుల్లో మలక్‌పేట్ యశోద ఆసుపత్రి వైద్య బృందం ద్వారా విజయవంతమైన ఫలితాలను అందిస్తున్నామని తెలిపారు. ప్రాణాల అంచున నిలిచిన తల్లిశిశువులకు మళ్లీ ఆశలు నింపిన ఈ ఘటన, వైద్యం అనేది కేవలం చికిత్స మాత్రమే కాకుండా జీవితం పట్ల బాధ్యత, మానవత్వం, అంకితభావం కలిసిన మహోన్నత సేవ అని మరొకసారి చాటిచెప్పింది.

## హనుమాన్ స్వాములకు సర్పంచి ఎండి మొయిజ్ బిక్ష..





**రామడుగు మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో మంగళవారం రోజున మతసామరస్యం వెల్లివిరిసింది. హనుమాన్ మాలధారణ చేసిన స్వాములకు రామడుగు గ్రామసర్పంచి ఎండి మొయిజ్ ప్రత్యేకంగా భిక్ష అన్నదానంఏర్పాటు చేశారు. భక్తి, మానవత్వం మతాల కంటే గొప్పవని ఆయన చాటిచెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తాయని, అందరూ ఐక్యంగా ఉండాలని స్వాములు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు హనుమాన్ భక్తబృందం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పెన్షనర్ల బ్లాక్ డే

**● పెన్షన్ వాలిడేషన్ యాక్ట్2025 రద్దు చేయాలి**

**● జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిరసనలు**

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు మార్చి 25న జిల్లావ్యాప్తంగా పెన్షనర్లు బ్లాక్ డే పాటించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి టి. వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం మార్చి 25న పార్లమెంట్ ఆమోదించిన పెన్షన్ వాలిడేషన్ యాక్ట్2025ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. పెన్షనర్లను వివిధ రకాలుగా విభజించే విధంగా ఈ చట్టం అమలులోకి తీసుకురావడం అన్యాయమని, దీని వల్ల రిటైర్డ్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని నాయకులు తెలిపారు. ప్రభుత్వానికి జీవితాంతం సేవలందించిన ఉద్యోగుల పట్ల ఇలాంటి వివక్షాత్మక విధానాలు అవలంబించడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు మాత్రమే కాకుండా, వారి జీవన భద్రతకు ఆధారమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 25న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పెన్షనర్లు నల్ల బాడ్జీలు ధరించి, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల తహసీల్దారుల ద్వారా ప్రధానమంత్రి గారికి విజ్ఞాపన పత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రికి వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. పెన్షనర్ల సంక్షేమానికి భంగం కలిగించే ఎలాంటి చట్టాలనైనా ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, పెన్షనర్లలో అసంతృప్తి రేకెత్తించే నిర్ణయాలను పునఃసమీక్షించాలని సంఘ నాయకులు కోరారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి, వారి ఆందోళనలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని విభాగాలకు చెందిన పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఎం. సుబ్బయ్య, టి. వేణు పిలుపునిచ్చారు. పెన్షనర్ల ఐక్యతను చాటిచెప్పేలా బ్లాక్ డే కార్యక్రమం శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించాలని వారు కోరారు.

## వాహన పత్రాలు చూపించి వాటి పై పెండింగ్లో ఉన్న చాలాన్లు చెల్లించి మీ వాహనాలను తీసుకెళ్లండి: ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు

**● ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో 35 వాహనాలు**




| S. No | Type of Vehicle | Chassis/Engine Number | S.No | Type of Vehicle | Chassis/Engine Number |
|---|---|---|---|---|---|
| 1 | Activa | ME4JF913BLG062849 | 19 | Pulsar NS160 | MD2A92DX7PCF23129/8 |
| 2 | Passion Pro | MDLHA10BSFHH26289 | 20 | TVS Raider | MD625AF95R2F05244 |
| 3 | Passion plus | MBLHAW410SHF05310 | 21 | Activa | ME4JK361FSW158719 |
| 4 | Shine | ME4JC654CH7058562 | 22 | Yamaha FZ | ME1RG4215J0038237 |
| 5 | Activa | ME4JK156LPG330913 | 23 | Activa | ME4JK361MSG263616 |
| 6 | Activa | ME4JK158HRG040396 | 24 | Activa | JF50E-7-7123284 |
| 7 | TVS (ZEST) | FG5AS2608082 | 25 | Excel (Luna) | M27LN1E11S2H07874 |
| 8 | Activa | JF50E-T-2452622 | 26 | Platina | MD2A76AX9PWC17971 |
| 9 | Grazia | JF49E-W-2013716 | 27 | Dio | JF39E-T-4120451 |
| 10 | Yamaha ZR | E3N8E0330100 | 28 | Scooty Pep | MD626BG34G2L97237 |
| 11 | Splendor Plus | M8LHAW17XN5L50003 | 29 | Splendor Plus | MBLHA10KLFHA63809 |
| 12 | Pulsar | MD2B68BX2PWF29387 | 30 | Passion Pro | MBLHA10B5GHF40916 |
| 13 | Activa | JF50E18400745 | 31 | Pulsar Red | MD2DHDHZZSCF89377 |
| 14 | Jupiter ZX | EG4GJ1416404 | 32 | Jupiter ZX | MD626BG43G1N72267 |
| 15 | Jupiter | CG5AL1000904 | 33 | Bajaj CT100 | DUFBMF84476 |
| 16 | Pulsar Black | MD2DHDHZZPCF17523 | 34 | Maestro | MBLJF32ADFGC03349 |
| 17 | Activa | JC44E5663268 | 35 | Activa | ME4JC448KC7597700 |
| 18 | Glamour | MBLJAS052JGE01294 | | | |

**ఎల్బీనగర్ మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్ బి నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులలో పట్టుబడిన వాహనాలు పట్టుబడినప్పటి నుండి ఇప్పటివరకు ఆ వాహనాల యజమానులు వాటి మీద చలానాల రూపంలో ఉన్న జరిమానాలను చెల్లించి తమ వాహనాలను తీసుకుపోవాల్సిందిగా ఎల్బీనగర్ ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సదరు వాహన యజమానులకు ఇప్పటి వరకు పోస్ట్ ద్వారా నోటీసులు ఇవ్వడంతో పాటు సమాచారం ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్కరూ ముందుకు వచ్చి పైన తెలుపబడిన వారి వాహనాలను తీసుకుపోవుటకు రాలేకపోయినందున, చివరి ప్రయత్నం గా సోషల్ మీడియా ద్వారా తెలియజేయుచున్నామని వాహన యజమానులు స్టేషన్ వచ్చి, సరైన వాహన పత్రాలు చూపించి, వాటి పై పెండింగ్లో ఉన్న చాలాన్లు చెల్లించి తీసుకెళ్లగలరని లేని పక్షంలో చట్ట ప్రకారం నిబంధనల మేరకు వేలం వేయడం జరుగుతుందని సదరు వాహన యజమానులకు తెలియపరుస్తున్నామని, సమాచారం కోసం 8712662773 సంప్రదించగలరని ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

## కరీంనగర్ 60వ డివిజన్‌లో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..





**కరీంనగర్ టౌన్ మార్చి 24(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని 60వ డివిజన్ పరిధిలో ఈ రోజు సిఎంఆర్ఎఫ్ (చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా 60వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్ కూడా కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యేతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించడంలో సిఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరమని స్థానిక నాయకులు పేర్కొన్నారు.

# కల్లూరు అభివృద్ధికి అడుగులు

**● అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీజ పరిశీలన**

**● మున్సిపల్ అభివృద్ధిపై చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ దృష్టి**

**● కొత్త భవనం, డంపింగ్ యార్డ్, వాటర్ ఫిల్టర్ యూనిట్‌కు ప్రాధాన్యం**






**కల్లూరు, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా కీలక ముందడుగు పడింది. అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీజ మంగళవారం కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అవసరాలు, ప్రాజెక్టులపై సమగ్రంగా వివరాలు సేకరించారు. మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ముఖ్యంగా మున్సిపల్ కొత్త భవనం నిర్మాణం, ఆధునిక డంపింగ్ యార్డ్ ఏర్పాటు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే వాటర్ ఫిల్టర్ యూనిట్ స్థాపన వంటి అంశాలను అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం తాను కట్టుబడి పనిచేస్తున్నానని, ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఆయన ప్రతిపాదనలపై అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీజ సానుకూలంగా స్పందించి, విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనతో కల్లూరు పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త ఊపిరి లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఇంచార్జ్ కమిషనర్ నరసింహా, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరావు, దరావత్ రవికుమార్ పలువురు పాల్గొన్నారు.

## లక్ష్యాల సాధనకు సమన్వయం కీలకం: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**కల్లూరు, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ సంబంధిత శాఖల అధికారులతో ఎస్ఆర్ఎల్ఐపి పై సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు ప్రస్తుత పురోగతి, అమలు విధానం, ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగాసబ్-కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలంటే ప్రతి శాఖ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పనుల అమలులో జాప్యం లేకుండా ముందుకు సాగాలని, ప్రతి అధికారి తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా కార్యక్రమంల ఫలితాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే విభాగాల మధ్య సమన్వయం లోపిస్తే ప్రాజెక్టు అమలు దెబ్బతింటుందని హెచ్చరించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు చురుకైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసి అభినందించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు...



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, మార్చి24(పీసీడబ్ల్యూ న్యూస్):** సిద్ధిపేట జిల్లా నర్మెట్ట సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "రైతు భరోసా" నిధులను విడుదల చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నర్మెట్ట బహిరంగ సభలో రైతు భరోసా కింద తొలి విడుతగా ఎకరం వరకు వ్యవసాయ భూములు కలిగి ఉన్న 70 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 3,600 కోట్లు డబ్బు జమకానుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి అభినందనలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. అందులో భాగంగానే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కంటోన్మెంట్ శాసనసభ్యులు గణేష్ ప్రభృతులు మంగళవారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అభినందనలు తెలియజేశారు. రైతు భరోసా నిధుల విడుదలపై ఉగాది పర్వదినాన తీపి కబురు అందించిన ప్రభుత్వం నర్మెట్ట సభలో వాటికి మీటనొక్కి విడుదల చేయడం ద్వారా మాటనిలుపుకున్నారంటూ రేవంత్ రెడ్డిని అభినందలతో ముంచెత్తారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కల్లూరు, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు నిర్వహించబడనున్న నేపథ్యంలో, నేడు బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుందనీ విద్యుత్ శాఖ ఏ ఈ ఆసిఫ్ తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం విద్యుత్ అంతరాయం కారణంగా లింగాల, పాత ఎర్రబోయినపల్లి, కొత్త ఎర్రబోయినపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందనీ అన్నారు. విద్యుత్ సరఫరా నిలిచే సమయంలో గృహ అవసరాలు, వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలగవచ్చునని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యుత్‌పై ఆధారపడే చిన్న వ్యాపారులు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.చెట్లు కొట్టివేత పనులకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. పనులు పూర్తయ్యిన వెంటనే విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## నవజాత శిశువులకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలను అందించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువులకు స్థానికంగా మెరుగైన వైద్య సేవల నుంచి ఇతర ఆసుపత్రులకు తరలించకుండా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అన్ని వార్డులను సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు, శుభ్రతను పరిశీలించారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న నిర్మాణ, అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిని త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ఆస్పత్రిలో మెరుగైన వైద్యం సేవలు అందిస్తున్నారని కొనియాడుతూ వైద్య సిబ్బంది అదనపు శిక్షణ పొంది ఇంకా మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జి.జి.హెచ్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.





**ములుగు జిల్లా, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, జీవనప్రమాణాలు పెంపొందించేందుకు కృత నిశ్చయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోవిందరావుపేట్ లో జరుగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోని భాగంగా, స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య శిబిరాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ప్రజలు స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని, ఈ క్యాంపు లలో గర్భిణీ స్త్రీలు, శిశువులు, కిషోర బాలికలు వృద్ధుల ఎక్కువ సంఖ్యలో వచ్చి వైద్య సేవల పొందాలని పిలుపునిచ్చారు. వైద్య సేవల కొరకై వచ్చిన రోగులను, వారికి అందుతున్న వైద్య సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి రోగులు అందుతున్న వైద్య సేవ పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ ఆయుష్ వైద్య సేవలు కూడా కావాలని కలెక్టర్ ను కోరారు. కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్ గదిని పరిశీలించి ప్రతిరోజు రోగులకు ఎటువంటి రక్త పరీక్షలు చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్ ను, మందుల గదిని పరిశీలించి అన్ని రకాల మందులను సమకూర్చుకోవాలని ఫార్మాసిస్టుకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ఓపి సేవల రోగుల సంఖ్యను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ డాక్టర్ అనూష పి హెచ్ ఎన్ లక్ష్మి శ్యామల జంపయ్య నీరజ శివాని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చు: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు జిల్లా, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని ఏరియా ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన ప్రపంచ -క్షయ వ్యాధి దినోత్సవం, 'క్షయ వ్యాధి -ముక్తుభారత్ రెండవ విడత ' ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ముఖ్యఅతిథిగా విచ్చేసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం సమావేశం డి ఎం హెచ్ ఓ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవును-టిబినీ మనం అందరం అంతం' చేయవచ్చు అనే ఈ సంవత్సర- అనే నినాదంతో "ములుగు జిల్లాలో ఎంపిక చేయబడిన గ్రామాలలో క్షయ వ్యాధి నిర్ధారణ, వ్యాధి అరికట్టే చర్యలు, వ్యాధి చికిత్స పట్ల విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో గ్రామాలలోని ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమాజంలోని ప్రతి ఒక్కరు తమ విధిగా ముందుకు వచ్చి, క్షయ వ్యాధి నిర్మూల న కార్యక్రమంలో పాలుపంచుకున్నప్పుడే క్షయ రహిత జిల్లాగా ములుగు మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ, టీబి వ్యాధి ఒక




బ్యాక్టీరియా వల్ల వస్తుందని, టిబి వ్యాధి గ్రస్తుల నుండి వారు మాట్లాడినప్పుడు లేదా దగ్గినప్పుడు తుంపర్లు గాలి ద్వారా ఒకరి నుండి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందని అన్నారు.ఈరోజు నుండి టీబి ముక్తు భారత్ కార్యక్రమ రెండవ విడత వందరోజుల కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమంలో 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి టీబి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, ములుగు జిల్లాలో ఎంపిక చేయబడిన 20 గ్రామాలలో మొబైల్ ఎక్రే మిషన్ ద్వారా అందరికీ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని, దానితోపాటు అసంక్రమిక వ్యాధులైన మధుమేహము రక్తపోటు హిమోగ్లోబిన్ పరీక్షలు కూడా చేస్తామని, నిర్ధారణ అయినా రోగులకు వెంటనే టీబి చికిత్సను మొదలు పెడతామని, దీని ద్వారా టీబి వ్యాప్తి అరికట్టవచ్చునని వివరించారు. రెండు వారాల నుండి జ్వరము దగ్గు బరువు తగ్గడం ఇలాంటి వారికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో "తెమడ ను సి బి నాట్ "పరీక్షలు నిర్వహిస్తామని దీని ద్వారా వ్యాధి నిర్ధారణ అవుతుందని , జి.జి.హెచ్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ సర్వీసెస్ డాక్టర్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ నాగ అనీష్ మాస్ మీడియా అధికారి సంపత్ ప్రోగ్రామ్స్ డిపిహెచ్ఎం శకుంతల మానిటరింగ్ సూపర్వైజర్ వెంకట్ రెడ్డి సురేష్ బాబు సూపర్వైజర్స్ నిర్మల మేరీ దేవమ్మ జిల్లాటీబి ప్రోగ్రాం సిబ్బంది రమేష్ రాజు చందు ఆరోగ్య కార్యకర్తలు ఉమా, భాస్కర్ రాజన్న రవి హరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం: సబ్ కలెక్టర్, ఏసీపీ పిలుపు

**కల్లూరు, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్ పిలుపునిచ్చారు.యువత భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని,సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను సానుకూల దిశలో మలుచుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ, పౌర సరఫరాలు, మీ సేవ, పిటిషన్లు, భూసంబంధిత అంశాలలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.





డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజ సాధన ధ్యేయంగా అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనకు యువత, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. ఆరోగ్యకర జీవన విధానం ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం పెంపొందించి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. శాంతి భద్రతల కోసం సమిష్టి బాధ్యత, సమాజంలో శాంతి, భద్రతలు నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అధికారులు కోరారు.

# భగత్‌సింగ్ చూపిన బాటలో యువత పోరాడాలి

**- యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్**

**- అమర వీరుడు భగత్‌సింగ్‌కు కొవ్వొత్తుల నివాళి**

**- భారతరత్నతో భగత్‌సింగ్ త్యాగానికి గౌరవం ఇవ్వాలి**

**- లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణకు భగత్‌సింగ్ స్ఫూర్తి అవసరం**




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 24 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భగత్‌సింగ్ చూపిన బాటలో యువత పోరాడాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ అన్నారు. మహానాయకుడు, అమర విప్లవ వీరుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఖమ్మం నగరంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. దేశభక్తి జ్యోతి, త్యాగ స్ఫూర్తి, విప్లవ చైతన్యానికి ప్రతీకగా నిలిచిన భగత్ సింగ్ స్మృతులను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం హృదయాలను హత్తుకునేలా సాగింది. యువత చేతుల్లో వెలిగిన కొవ్వొత్తులు కేవలం కాంతి కాదు, భగత్ సింగ్ ఆశయాలకు అంకితమైన గౌరవ వందనంగా మారాయి. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ మాట్లాడుతూ... భగత్ సింగ్ జీవితం భారత యువతకు చిరస్థాయి ప్రేరణ అని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా తీసుకున్న మహానుభావుడు భగత్ సింగ్ అని అన్నారు. 1907 సెప్టెంబర్ 28న పంజాబ్‌లో జన్మించిన భగత్ సింగ్, చిన్న వయసులోనే దేశభక్తి భావాలను అలవర్చుకుని, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఉక్కు సంకల్పంతో పోరాడారని గుర్తుచేశారు. కేవలం



23 ఏళ్ల వయసులోనే 1931 మార్చి 23న దేశం కోసం తన ప్రాణాలను అర్పించి అమరుడయ్యారని తెలిపారు.భగత్ సింగ్ త్యాగం కేవలం చరిత్రలో ఒక సంఘటన మాత్రమే కాదని, అది తరతరాలకు స్ఫూర్తినిచ్చే జ్యోతి అని ఆయన అన్నారు. అన్యాయం, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా నిలబడే ధైర్యం ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సిన గొప్ప గుణమని చెప్పారు. భగత్ సింగ్ చూపిన మార్గం యువతలో చైతన్యాన్ని రగిలిస్తూ, దేశ నిర్మాణంలో బాధ్యతాయుత పాత్ర పోషించేలా ప్రేరేపిస్తోందన్నారు.కొవ్వొత్తుల ప్రదర్శన ద్వారా భగత్ సింగ్‌కు నివాళులర్పించిన విద్యార్థి యువజన నాయకులు, ఆయన ఆశయాలను నేటి తరానికి చేరవేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం దేశభక్తి నినాదాలతో, విప్లవ స్ఫూర్తిని మేల్కొలిపే వాతావరణంతో మార్మోగింది. భగత్ సింగ్ వంటి అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని, అలాంటి మహనీయుల ఆశయాలను కాపాడుకోవడం సమాజం మొత్తపు బాధ్యత అని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ నాయకులు మేఘన, యువసేన నాయకులు గణేష్, పండు, రాజేష్, ప్రీతం, అరుణ్ తదితరులు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి ఎప్పటికీ చిరస్మరణీయమని, భగత్ సింగ్ పేరు భారత చరిత్రలో అజరామరంగా నిలిచిపోతుందని ఘనంగా స్మరించారు.

# నిరంతర యజ్ఞంలా సీఎం కప్

## తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం

## క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం

## రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**హైదరాబాద్,మార్చి24:** తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ప్రోసీల బహుకరణ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర పక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు.÷ఖఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికి స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే పక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు. ÷–రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ÷ూష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆ÷–లనైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. వరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్ గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిడే మహిళల టోర్నమెంట్‌కు దూరం

## • వైదొలగుతున్నట్లు హంపి పోస్ట్




**విజయవాడ,మార్చి24:** భారత చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిష్టాత్మకమైన ఫిడే మహిళల క్యాండిటేట్స్ టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. యుద్ధం కారణంగా భద్రతపై ఆందోళనగా ఉందని, బాంబుల మోతల మధ్య చెస్ పై శ్రద్ధ పెట్టడం సాధ్యం కాదని వాపోయింది. ఇదివరకే టోర్నీ వేదికపై అసంతృప్తి వ్యక్తం చేసిన హంపి చివరకు టోర్నీని బాయ్ కాట్ చేస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'చాలా సమయం ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ నుంచి । వైదొలుగుతున్నా. వ్యక్తిగత భద్రత, సురక్షితంగా ఉండడం కంటే ఏ ఈవెంట్ ముఖ్యమైనది కాదు. భరోసా నిర్వాహకులు కల్పించినప్పటికీ ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్లో నేను సురక్షితంగా ఉంటానని అనిపించడం లేదు. ఈ నిర్ణయం బాధతో కూడినదే. కానీ, తప్పనిసరిగా తీసుకో వాల్సి వచ్చింది. నేను నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను' అని హంపి తన పోస్ట్లో వెల్లడించింది. దుబాయ్లో చిక్కుకొని ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ షిప్ పోటీలకు బ్యాడ్మింటన్ స్టార్÷ువి సింధు దూరంగా ఉండగా.. కోనేరు హంపి సైతం మెగా ఈవెంట్ నుంచి వైదొలిగింది. మార్చి 28 నుంచి ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. హంపి వైదొలగడంతో ఆమె స్థానంలో ఉక్రెయిన్ అమ్మాయి అన్నా ముజిచుక్ క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపికైంది. అయితే.. టోర్నీలో ఆడనందుకు హంపి పై భారీ జరిమానా పడింది. నిబంధనల ప్రకారం టోర్నీని బాయ్కట్ చేసినందుకు ఆమె భారత కరెన్సీలో రూ.1.50కోట్లు జరిమానా పడే ఛాన్స్ ఉంది.



# దక్షిణాఫ్రికా పర్యటనకు టీమిండియా మహిళా జట్టు ప్రకటన

త్వరలో దక్షిణాఫ్రికాలో భారత మహిళల జట్టు పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో భారత మహిళలు 5 మ్యాచ్ల టీ20 సిరీస్ ఆడనున్నారు. ఏప్రిల్ 17న ఈ సిరీస్ ప్రారంభం కానుంది. కాగా.. ఈ సిరీస్లో పాల్గొనే భారత మహిళా జట్టును బీసీసీఐ ప్రకటించింది.ఇక 15 మంది సభ్యులు గల బృందానికి హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వం వహించనుంది. వైస్ కెప్టెన్గా స్మృతి మంధాన వ్యహరించనుంది. ఆల్రౌండర్ అనుష్క శర్మకు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. అలాగే కాష్వీ గౌతమ్ టీ20 అరంగ్రేటానికి సిద్ధమైంది. ఇటీవల ఆసీస్తో సిరీస్కు ఎంపికైన వైష్ణవి శర్మ, స్నేహ్ రాణా, జి.కమలినీ, అమన్జోత్ కౌర్లకు దక్షిణాఫ్రికాతో సిరీస్కు చోటు దక్కలేదు.**దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్కు టీమిండియా ఉమెన్స్ టీమ్ ఇదే..**హర్మన్ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ , రిచా ఘోష్, అరుంధతి రెడ్డి , రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, శ్రేయాంక పాటిల్, కష్వీ గౌతమ్, భారతీ ఫుల్మాలి, ఉమా ఛెత్రి, అనుష్క శర్మ.

# తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ పెద్ద దిక్కు

## • టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్


ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గిన తొలి జట్టు ముంబై ఇండియన్స్ ). తొలి ఐదేళ్లలో ఒక్క టైటిల్ కూడా నెగ్గని ముంబై.. 2013లో తొలిసారి ఛాంపియన్గా నిలిచింది. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లలో మరో నాలుగు టైటిల్స్ నెగ్గింది. ఈ ఐదు టైటిల్స్ కూడా రోహిత్ శర్మ కెప్టెన్సీలోనే రావడం విశేషం. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ సమీపిస్తున్న తరుణంలో జట్ల బలాబలాలు, ఆటగాళ్ల ప్రదర్శనపై విశ్లేషణలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ముంబై ఇండియన్స్ జట్టు గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముంబై జట్టులో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి దిగ్గజ బ్యాటర్లు ఉన్నప్పటికీ, రాబోయే సీజన్లో ఆ జట్టుకు అత్యుత్తమ బ్యాటర్గా మరో ప్లేయర్ను ఎంపిక చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్లో ఐపీఎల్ 2026 అంచనాల గురించి మాట్లాడుతూ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముంబై ఇండియన్స్ జట్టులో ఎంతోమంది మ్యాచ్ విన్నర్లు ఉన్నారని, కానీ తిలక్ వర్మ ఒక 'కంప్లీట్ ప్యాకేజీ' అని ఆయన కొనియాడారు. "చాలామంది రోహిత్ శర్మ విధ్వంసం గురించి లేదా సూర్యకుమార్ యాదవ్ 360 డిగ్రీల ఆట గురించి మాట్లాడుకుంటారు. కానీ నా దృష్టిలో ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక పరుగులు చేసే ఆటగాడిగా, అత్యంత ప్రభావ వంతమైన బ్యాటర్గా తిలక్ వర్మ నిలుస్తాడు" అని అశ్విన్ పేర్కొన్నారు. తిలక్ వర్మ గత కొన్ని సీజన్ల నుండి ముంబై ఇండియన్స్ జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ జట్టును ఆదుకోవడంలో తిలక్ చూపించే పరిణతి అద్భుతమని అశ్విన్ విశ్లేషించారు. ఐదుసార్లు ఛాంపియన్గా నిలిచిన ముంబై జట్టులో మిడిల్ ఆర్డర్కు తిలక్ వర్మ వెన్నెముకగా మారాడని, అతడి బ్యాటింగ్ శైలి జట్టుకు అవసరమైన సమతుల్యతను ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఆటగాళ్లు అనడంలో సందేహం లేదని, అయితే తిలక్ వర్మ ఇన్నింగ్స్ను నిర్మించే తీరు, అవసరమైనప్పుడు గేర్ మార్చి భారీ షాట్లు ఆడే సామర్థ్యం అతడిని ప్రత్యేకంగా నిలబెడతాయని అశ్విన్ వివరించారు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కో వడంలో తిలక్ వర్మకు ఉన్న పట్టు, మైదానం నలుమూలలా బంతిని తరలించే టెక్నిక్ అతడికి అదనపు బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. 2022లో ముంబై ఇండియన్స్ జట్టులోకి ప్రవేశించినప్పటి నుండి తిలక్ వర్మ వెనక్కి తిరిగి చూడలేదు.



# ఆటగాళ్లకు రికీ పాంటింగ్ దిశానిర్దేశం




ఐపీఎల్ 2026 వేట మొదలైంది. గత సీజన్లో తృటిలో చేజారిన టైటిల్ను ఈసారి ఎలాగైనా ముద్దాడాలని పంజాబ్ కింగ్స్కంకణం కట్టుకుంది. ఈ క్రమంలోనే జట్టు కొత్త హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ రంగంలోకి దిగారు. చండీగఢ్ వేదికగా జరుగుతున్న ప్రాక్టీస్ క్యాంప్లో చేరిన పాంటింగ్, అడుగు పెట్టడమే ఆలస్యం ఆటగాళ్లకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. నెట్స్లో కేవలం బంతులు విసరడం, బ్యాట్ ఊపడం మాత్రమే సరిపోదని, మానసికంగా, శారీరకగా యుద్ధానికి సిద్ధం కావాలని కుండబద్దలు కొట్టారు. మార్చి 31న న్యూ చండీగఢ్ వేదికగా గుజరాత్ టైటాన్స్తో పంజాబ్ కింగ్స్ తన తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఈ నేపథ్యంలో రికీ పాంటింగ్ ఆటగాళ్లకు దిశానిర్దేశం చేశారు. "కేవలం నెట్స్లో సమయం గడపడం వల్ల ఎలాంటి ప్రయోజనం అనేది ఉండదు. టెక్నికల్ గా, ఫిజికల్ గా, అంతకంటే ముఖ్యంగా మెంటల్ గా మ్యాచ్కి సిద్ధంగా ఉండాలి" అని ఆయన తేల్చి చెప్పారు. ట్రైనింగ్ సెషన్లు అంటే కేవలం అలవాటు కోసం చేసేవి కాదని, మనల్ని మనం ఒక విజేతగా మలచుకునే సమయం అని గుర్తు చేశారు. జట్టులో ఐక్యత ఉంటేనే అద్భుతాలు జరుగుతాయని గతేడాది ప్రదర్శనను ఉదాహరణగా చూపారు. క్రికెట్లో తప్పులు చేయడం సహజమని, కానీ పక్కా ప్రణాళికతో ఆడటం ముఖ్యమని పాంటింగ్ ప్లేయర్లకు హితబోధ చేశారు. ఎవరైనా క్యాచ్ వదిలేయవచ్చు లేదా బౌలర్ వైడ్ బాల్ వేయవచ్చు, అంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఒక ఆటగాడు తన గేమ్ ప్లాన్ మీద నమ్మకంతో ఉండి, సరైన ఆలోచనతో ఆడుతున్నప్పుడు పొరపాట్లు జరిగితే అది పెద్ద సమస్య కాదని ఆయన అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్ ఫలితాల మీద ఒత్తిడి పెంచుకోకుండా, ప్రతి రోజూ అనుసరించే పద్ధతి మీద దృష్టి పెడితే సక్సెస్ ఆటోమేటిక్ గా వస్తుందని పాంటింగ్ భరోసా ఇచ్చారు. గత ఐపీఎల్ సీజన్లో పంజాబ్ కింగ్స్ ఫైనల్ వరకు దూసుకెళ్లింది. కానీ, నిర్ణయాత్మక పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జడీ) చేతిలో కేవలం 6 పరుగుల తేడాతో ఓడిపోయింది.




# రూ. 15 వేల కోట్లకు అమ్ముడైన రాజస్థాన్ రాయల్స్!

రాజస్థాన్ రాయల్స్ అమ్మకం ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం 1.63 బిలియన్ డాలర్లకు జట్టును కొనుగోలు చేసింది. ఈ క్రమంలో 1 బిలియన్ డాలర్లకు అమ్ముడైన తొలి ఐపీఎల్ జట్టుగా ఆర్ఆర్ నిలిచింది. కల్ సోమాని కన్సార్టియానికి వాల్మార్ట్ కుటుంబానికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, అలాగే ఎంఎఫ్ఎల్ జట్టు డెట్రాయిట్ లయన్స్లో మెజారిటీ వాటాలు కలిగిన హాంప్ కుటుంబం నుంచి ఆర్థిక మద్దతు లభించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన డీల్. ఈ డీల్తో రాజస్థాన్ రాయల్స్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీగా నిలవనుంది.ఐపీఎల్ 2026 ముగిసిన తరువాత కొత్త యాజమాన్యం బాధ్యతలను స్వీకరించనుంది. గతంలో సంజీవ్ గోయెంకాకు చెందిన ఆర్పిఎస్జి గ్రూప్ లక్నో సూపర్ జెయింట్స్ను 940 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా.. టొరెంట్ గ్రూప్ గుజరాత్ టైటాన్స్లో 67 శాతం వాటాను 575 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త అయిన సోమాని ఇప్పటివరకు రాజస్థాన్ రాయల్స్లో మైనారిటీ వాటాను కలిగి ఉన్నారు.

# ఎడ్వర్డ్స్ స్థానంలో డేవిడ్ పేన్



సన్రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026కి ముందు కీలక నిర్ణయం తీసుకుంది. గాయంతో ఈ సీజన్ ప్రారంభానికి ముందే తప్పుకున్న ఆస్ట్రేలియా ఆల్రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ స్థానంలో మరో పేసర్ను తీసుకుంది. ఎడ్వర్డ్స్ స్థానంలో ఇంగ్లాండ్ సీనియర్ బౌలర్ డేవిడ్ పేన్ను తీసుకుంది. ఈ విషయాన్ని సన్రైజర్స్ హైదరాబాద్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. 35 ఏళ్ల డేవిడ్ను సన్రైజర్స్ 1.5 కోట్లకు దక్కించుకుంది. ఇంగ్లాండ్ తరుపున డేవిడ్ కేవలం ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. అయితే.. టీ20 ఫార్మాట్లో డేవిడ్కి అపారమైన అనుభవం ఉంది. 233 టీ20 మ్యాచ్లు ఆడాడు. 8.03 ఎకానమీతో 304 వికెట్లు పడగొట్టాడు. ఇటీవల బిగ్ బాష్ లీగ్లోనూ డేవిడ్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఆరు మ్యాచ్ల్లో 11 వికెట్లు పడగొట్టి తన జట్టు పెర్త్ స్కార్చర్స్ టైటిల్ అందుకోవడంలో డేవిడ్ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సైతం అందుకున్నాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో 18 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. ఇక ఐపీఎల్ 2026 మార్చి 28న ప్రారంభం కానుంది. కాగా.. ఆరంభ మ్యాచ్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో సన్రైజర్స్ హైదరాబాద్ జట్టు తలపడనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఈ మ్యాచ్కు ఆతిథ్యం ఇవ్వనుంది.


## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎ÷–లాట్‌ఫారమ్‌లు, అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో టీ–షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ఏఐ వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

## పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది



## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు సోషల్ మీడియాలో లయన్ పోస్టర్‌పై ఆసక్తి



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ–లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్–ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.



## విశాఖలో నటి శ్రుతి హాసన్ సందడి..

విశాఖపట్నంలో నటి శ్రుతి హాసన్ సందడి చేశారు. ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను ఆమె ప్రారంభించారు. ఇక, తమ అభిమాన నటి షోరూం ప్రారంభోత్సవానికి రావడంతో ఆమెను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. షోరూం ప్రారంభోత్సవం అనంతరం శ్రుతి హాసన్ అభిమానులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో శ్రుతి హాసన్‌తో పాటు ఎమ్మెల్యేలు సి.హెచ్. వంశీ కృష్ణ, వి. రామకృష్ణ బాబు కూడా పాల్గొన్నారు.

## డెతడి గ్లింప్స్.. ఘనీ భాయ్ ఎనర్జీతో ఆకట్టుకున్న ఆశిష్!

దిల్ రాజు.. శిరీష్ కలిసి కొత్తగా డెతడి అనే సినిమా తీసుకొస్తున్నారు. ఈ సినిమాలో యంగ్ హీరో ఆశిష్ నటిస్తున్నారు. ఆయన ఇప్పటికే రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో గుర్తింపు పొందారు. ఈ సినిమాతో ఆదిత్య రావు గంగసాని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కథ హైదరాబాద్ నేపథ్యంలో సాగుతుంది. నగర సంస్కృతి, జీవన శైలి, ఉత్సాహాన్ని ఈ సినిమా చూపించబోతోంది. ఈరోజు ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇది చూసిన ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి పెరిగింది. గ్లింప్స్‌లో ప్రధాన పాత్ర ఘనీ భాయ్ (ఘన్ను భాయ్)ను ఒక స్ట్రీట్ డ్రమ్ ఆర్టిస్ట్ గా పరిచయం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో జరిగే పండుగలు, వేడుకల్లో డ్రమ్స్ వాయిస్తూ అందరిని అలరిస్తూ ఉంటాము అని హీరో డైలాగులు చెబుతూ స్టైల్ గా నరుస్తూ కనిపించారు.ఘనీ భాయ్.. నా పేరు.. సుమారు ఏడు కిలోల బరువు ఉన్న డ్రమ్స్ మోసుకుంటూ గంటల పాటు ఆగకుండా ప్రదర్శన ఇస్తూ ఉన్న నా మొహం లో చిరునవ్వు చెరగదు," అంటూ.. హీరో డైలాగులు హైలైట్ గా నిలిచాయి . ఈ పాత్రలో ఆశిష్ చాలా బాగా నటించారు. అతని రఫ్ లుక్, గడ్డం, స్టైల్ పాత్రకు సరిగ్గా సరిపోయాయి. ఆయన బాడీ లాంగ్వేజ్, హైదరాబాద్ స్లాంగ్ మాట్లాడే విధానం సహజంగా అనిపించింది. ఇక చివరిలో బ్యాండ్ వాళ్ళం కదా అన్న గట్టిగా వాయిస్తాము అన్న డైలాగ్ కూడా హైలెట్గా నిలిచింది. ! దర్శకుడు ఆదిత్య రావు గంగసాని కొత్తవాడైనా కథను బాగా చూపించినట్టు ఈ చిన్న గ్లిమ్స్ చూస్తే అర్థమవుతుంది. విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా, ఎనర్జీతో కనిపిస్తున్నాయి. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ మరియు దిల్ రాజు ప్రొడక్షన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు బలంగా రాశారు. జునైద్ కుమార్ సంగీతం డ్రమ్స్ బీట్‌తో మంచి ఉత్సాహాన్ని ఇవ్వబోతోంది. ఈ గ్లింప్స్ లాంచ్ కూడా గ్రాండ్‌గా జరిగింది. 500కి పైగా డ్రమర్స్ కలిసి లైవ్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఆ ఈవెంట్ మొత్తం ఎనర్జీతో నిండిపోయింది. డెతడి ఒక కలర్‌ఫుల్, ఎనర్జీతో నిండిన సినిమా అవుతుందని అనిపిస్తోంది. త్వరలో "జాతర" ప్రారంభమవుతుందని మేకర్స్ చెప్పడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది.




## జాన్వీ.. టాలీవుడ్ లో ఇలా..

టాలీవుడ్ లో అతిలోక సుందరిగా చిరస్థాయిగా నిలిచిన శ్రీదేవి రేంజ్ కు ఆమె కుమార్తె, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ చేరుకుంటుందా? అనే చర్చ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒకప్పుడు తెలుగు సహా ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీని తన అందం, అభినయంతో శాసించిన శ్రీదేవి వారసత్వాన్ని జాన్వీ కపూర్ కొనసాగించగలదా అనే ప్రశ్న అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. శ్రీదేవి 1970లో మా నాన్న నిర్దోషి చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, 1978లో వచ్చిన పదహారేళ్ల వయసుతో స్టార్ డమ్ అందుకున్నారు. అనంతరం ఆమె వెనక్కి తిరిగి చూసుకోకుండా వరుస విజయాలతో టాప్ ప్లేస్ లో నిలిచారు. తెలుగులో దాదాపు 100కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె.. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజాల సరసన సందడి చేశారు.

చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ సహా పలువురు సీనియర్ స్టార్ హీరోలతో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె నటించిన జగదేక వీరుడు అతిలోక సుందరి, వేటగాడు, ప్రేమాభిషేకం, కార్తీక దీపం, క్షణం క్షణం వంటి చిత్రాలు ఆమెను టాప్ ప్లేస్ కు చేర్చాయి. ఇక ఇప్పుడు జాన్వీ కపూర్ తన కెరీర్‌ను అదే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ విషయంపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది. బాలీవుడ్ లో ఇప్పటికే తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు టాలీవుడ్ పై పూర్తి దృష్టి సారించినట్లు అర్థమవుతోంది. తెలుగులో ఆమె తొలి చిత్రం దేవర కాగా.. అందులో జూనియర్ ఎన్టీఆర్ సరసన నటించి మంచి గుర్తింపు అందుకుంది. డెబ్యూతో హిట్ కూడా సాధించారు. ఇప్పుడు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది చిత్రంలో కూడా జాన్వీ హీరోయిన్ గా ఎంపిక కావడం విశేషం. దేవర షూటింగ్ లోనే ఆఫర్ రావడం గమనార్హం.పెద్ది మూవీ ఇప్పుడు విడుదలకు సిద్ధమవుతుండగా, టాలీవుడ్ లో ఆమెకు అవకాశాలు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. అయితే జాన్వీ కపూర్ భవిష్యత్తులో మరిన్ని పాన్ ఇండియా స్టార్ హీరోలతో పని చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా అల్లు అర్జున్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో నటించాలని ఆమె ఆసక్తి చూపుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే అల్లు అర్జున్ తో ఓ ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయని, దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రంలో జాన్వీ కనిపించనుందని టాక్ వినిపిస్తోంది.

